## చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

వెల్దుర్తి, మే 8: మాసాయిపేట మండలంలోని హల్దీ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రాజెక్టులో పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. వెల్దుర్తి మండలం చర్లపల్లి పంచాయతీ వర్దవాని చెరువు తండాకు చెందిన కెతావత్ గోపాల్ (30) గురువారం ఉదయం ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులతో పాటు వెల్దుర్తి పోలీసులకు సమాచారం అందించారు. వెల్దుర్తి పోలీసులు ప్రాజెక్ట్ వద్దకు చేరుకుని ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో మృతదేహం కోసం వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించగా ప్రాజెక్ట్ వద్దకు చేరుకుని మృతదేహం కోసం గాలిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని మృతదేహం

నర్సాపూర్, మే 8: చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానలో చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6న నర్సాపూర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి స్పృహ లేకుండా పడి ఉండగా కంట్రోలర్ సత్యనారాయణ గమనించి 108కి కాల్ చేశాడు. ఆ వ్యక్తిని నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గురువారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆ వ్యక్తి మృతి చెందాడు. మగ మనిషి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏండ్లు, ఎత్తు 5.6 చామనఛాయలో ఉన్నాడు. మృతుడి కుడిచేతిపై అనిత అనే పేరుతో పచ్చబొట్టు ఉంది. ఈ వ్యక్తి అనారోగ్య సమస్యతో లేదా వేరే ఇతర కారణాలతోనో మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని గుర్తిస్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై లింగం కోరారు.

## విద్యుదాఘాతంతో ఆవు మృతి



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన ఆవు

చిలిపిచెడ్,మే 8: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని గన్నె తండాలోని గురువారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గన్నె తండాకు చెందిన శంకర్ నాయక్ కూలీ పనులు చేసుకుంటూ పాడి పోషణతో జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన తన ఆవులను మేత కోసం శివారు ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ మేత మేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తుగా విద్యుత్ వైర్లు తగిలి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే విద్యుత్ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకొన్నారు. రైతుకు న్యాయం చేయాలని తండా ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు.


## వ్యక్తి కనబడుటలేదు



జగదీశ్వర్ (ఫైల్)

రేగోడ్, మే 8: బయటికెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి ఇప్పటివరకు తిరిగి రాని ఘటన రేగోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌదర్‌పల్లిలో చోటుచేసుకున్నది. ఏఎస్సై మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాయికోడ్ గ్రామానికి చెందిన చింతకుల జగదీశ్వర్, నవిత భార్యాభర్తలు. రాయికోడ్ నుంచి తమ పిల్లలతో కలిసి అత్తగారిల్లు చౌదర్‌పల్లికి వచ్చారు. జగదీశ్వర్ ఈ నెల 5న టిఫిన్ తీసుకొస్తానని చెప్పి రేగోడ్‌కు వెళ్లాడు. తిరిగి రాలేదు. ఈమేరకు నవిత ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు. బయటికి వెళ్లే సమయంలో గోధుమ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు, ఎత్తు 5.5 ఉంటుంది, రంగు నలుపు ఆచూకీ తెలిసినవారు రేగోడ్ పోలీసులకు (8712657926) తెలుపాలని ఏఎస్సై పేర్కొన్నారు.

## ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పెద్దశంకరంపేట, మే 8: పట్టణ శివారులోని ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయంలో గురువారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా శ్రీగురు మదనానంద అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర దేవతా కల్యాణ మహోత్స వంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోశ్చరణలతో ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.

# అడవిలో ఆహ్లాదం




అడవి జంతువులను చూసేందు కోసం అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బేస్ క్యాంపు

- పర్యాటకులకు ఉత్సాహం కల్గించేలా సదుపాయాలు
- జంతువుల దప్పిక తీర్చడానికి ప్రత్యేక ఏర్పాట్లు
- వన్యప్రాణుల సంరక్షణకు సాసర్ ఫీట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు



అటవీశాఖలో దాహం కోసం సాసర్ ఫీట్ల వద్ద చిరుత



దాహార్తి తీర్చుకోవడానికి వచ్చిన జింకలు

రామాయంపేట, ఏప్రిల్ 4: అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించేలా బేస్ క్యాంపు, గుడారాలు, అడవిలో తిరిగేందుకు రోడ్లు ఏర్పాటు చేశారు. ఇలా ఒక్కటి కాదు అనేక రకాలుగా అడవిని ఒక పర్యాటక కేంద్రంగా మార్చారు. సాయంత్రం సమయాల్లో పర్యాటకులు రోడ్డు మార్గం నుంచి వెళ్లే వాహనదారులు కాసేపు ఆగి మరీ సేద తీరేలా కేసీఆర్ ప్రభుత్వం అటవీ ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. రామాయంపేట అటవీశాఖ పరిధిలోని చేగుంట, చిన్నశంకరంపేట, నార్సింగి, నిజాంపేట, రామాయంపేట మండలాల పరిధిలోని అడవి ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంటుంది. రామాయంపేట నుంచి మెదక్, చేగుంట, చిన్నశంకరంపేట మండలాల్లో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నేడు చెట్లుగా పెరిగి బాగా పెరిగాయి. అడవిలో వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకోవడానికి సాసర్ ఫీట్లు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల్లో దుప్పులు, చిరుతలు, ఇతర వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకునేందుకు వచ్చిన చిత్రాలు లభించాయి. వీటిని చూడటానికి ఎలాంటి ప్రమాదం లేకుండా బేస్ క్యాంపు ఎక్కి చూసేవారు.

### జంతువుల దాహార్తికి సాసర్ ఫీట్లు

అడవులను కాపాడటమే కాకుండా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. అడవి అంటే కేవలం వన్యప్రాణులు తిరగడం, చెట్లు మాత్రమే కాదు ఒక మంచి పర్యాటక కేంద్రంగా ఆహ్లాదకర వాతావరణాన్ని పంచేలా తయారు చేశాం. అటవీశాఖలో గుడారాలు, గుడిసెలు, సోలార్ ఏర్పాటుచేశాం. ఇప్పటి వరకు అడవిలో చాలా రకాల వన్య ప్రాణులు తిరుగుతున్నాయి. చాలా మంది పర్యాటకులు వస్తున్నారు.

- విద్యాసాగర్, ఎఫ్ఆర్‌వో, రామాయంపేట



సాసర్ ఫీట్లలో నీరు పోస్తున్న వాచర్



పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు





వన్యప్రాణుల రక్షణ కోసంఏర్పాటు చేసిన సోలార్, గేటు

# నిర్దేశిత గడుపులోపు పరిష్కారం

- భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు
- కలెక్టర్ రాహుల్ రాజ్



గంగారంలో దరఖాస్తు పెట్టుకున్న రైతు సమస్యలను తెలుసుకుట్టున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

చిలిపిచెడ్, మే 8: భూ సమస్యలున్న వారు భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని దరఖాస్తు అందజేయాలని, వెంటనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పైలట్ ప్రాజెక్టుగా చిలిపిచెడ్ మండలం ఎంపికైన విషయం విధితమే. గురువారం మండలంలోని గంగారం, శేరిఫైజాబాద్ గ్రామాల్లో భూ భారతిలో భూ సమస్యలపై రైతులు ఇచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డుల్లో పేర్లు తప్పులు, భూమి విస్తీర్ణం హెచ్చుతగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదా బైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బీలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. భూ భారతి కొత్త ఆర్వోఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు భూములు పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేమని తెలిపారు. పైలట్ మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాక జిల్లాలోని అన్ని మండలాల్లో జూన్ మొదటి వారంలో రెవెన్యూ గ్రామాల వారిగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్లు సహదేవ్, ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్లు సింధూజ, సఫీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



చేగుంట తహసీల్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి



రామాయంపేటలో రైస్‌మిల్లర్స్, కార్యదర్శుల సమావేశంలో ఆర్డీవో రమాదేవి



చిన్నశంకరంపేట: గవ్వలపల్లి కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి
- తూప్రాన్, మెదక్ ఆర్డీవోలు జయచంద్రా రెడ్డి, రమాదేవి

చేగుంట, మే8: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. చేగుంటలోని తహసీల్ కార్యాలయంలో ఐకేపీ, పీఏసీఎస్ సీఈవోలు, సీసీలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండ ధాన్యం కొనాలన్నారు. కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలావి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 15 వర కు కల్లాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలన్నారు. లారీల కొరత ఉన్నందున ధాన్యం రవాణ కోసం రైతులు అద్దెట్రాక్టర్లు తెస్తే డబ్బులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఉప తహసీల్దార్ స్వప్న, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఆర్ఐ జయభారత్‌రెడ్డి, సంతోష్‌రావు, సీఈవోలు సంతోష్‌కుమార్, సందీప్, నరేశ్, ఐకేపీ సీసీలు స్వామి, రామస్వామి, అంజ్యానాయక్, శ్వేత ఉన్నారు.

### రామాయంపేటలో..

రామాయంపేట, మే 8: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. రామాయంపేటకు విచ్చేసిన ఆర్డీవో తహసీల్ కార్యాలయంలో రైస్‌మిల్లర్స్, పీఏసీఎస్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో పీఏసీఎస్ కార్యదర్శులు ధాన్యం తేమ శాతం రాగానే వెంటనే తూకం వేసి రైస్‌మిల్లుకు పంపించాలన్నారు. ధాన్యం వద్ద ఉన్న రైతులకు కేంద్రాల ఇన్‌చార్జిలు కావాల్సిన టార్పాలిన్లు, ఓఆర్‌ఎస్ పాకెట్లు, తాగునీరు సౌకర్యాలు కల్పించాలన్నారు. తహసీల్దార్ రజినీకుమారి, ఆర్ఐ గౌస్ పాల్గొన్నారు.

### చిన్నశంకరంపేటలో.,

చిన్నశంకరంపేట, మే 8: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మన్నన్ సూచించారు. గురువారం సూరారం, గవ్వలపల్లి, ఎస్.కొండాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. తూకాన్ని, రికార్డులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## జర్నలిస్టులపై పోలీసుల దాడి సరికాదు



నర్సాపూర్: ఆర్డీవో మహిపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నర్సాపూర్, మే 8: పోలీసుల చర్యలను ఖండిస్తూ నర్సాపూర్‌లో జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన గురువారం తెలిపారు. అనంతరం ఆర్డీవో మహిపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి ఇంట్లోకి పోలీసులు అక్రమంగా ప్రవేశించి, భయభ్రాంతులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వెల్లడించారు. నిరసనలో జర్నలిస్టులు భిక్షపతి, సుధాకర్, వెంకటేశ్‌గౌడ్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్‌గౌడ్, సుధాకర్, శ్రీశైలం, వినోద్ పాల్గొన్నారు.

### కౌడిపల్లిలో..

కౌడిపల్లి, మే 8: సాక్షి దిన పత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు దాడి చేసి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం కౌడిపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పోలీసుల తీరుపై డిప్యూటీ తహసీల్దార్ జహీర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మల్లేశ్, పెంటయ్య, శేఖర్‌గౌడ్, కుమార్, రవి గౌడ్, సుభాష్‌గౌడ్, ప్రశాంత్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

### శివ్వంపేటలో..

శివ్వంపేట, మే 8 : జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం ఏపీ ప్రభుత్వానికి తగదని శివ్వంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బొడ్డు రవి అన్నారు. గురువారం ఏపీలోని విజయవాడలో సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి ఇంటిపై చేసిన దాడిని ఖండిస్తూ మండల జర్నలిస్టులు తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఇసుగారి మల్లేశ్, నటరాజ్‌గౌడ్, ముంద్రాతి బాలేశ్, బుర్ర మహేశ్‌గౌడ్, కిశోర్‌గౌడ్, పల్లె వీరేశం, పోల్దాస్ వెంకటస్వామి, కుమ్మరి సురేశ్ తదితరులు ఉన్నారు.



కౌడిపల్లిలో..



శివ్వంపేటలో..

## రేషన్ షాపులకు అందని సన్న బియ్యం





రేషన్ బియ్యం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిలిపిచెడ్, మే 8: రేషన్ కార్డు ఉన్న ప్రతి నిరుపేద కుటుంబాలకు సన్న బియ్యం అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. మండలంలో 14 రేషన్ షాపుల్లో మొదటి నెల ఏదో నామమాత్రంగా సన్న బియ్యంలో నూకలతో కలిసి వచ్చాయని లబ్ధిదారులకు బియ్యం అందజేసింది. రెండో నెలలో తొమ్మిది రోజులు గడిచినా కాని ఏ ఒక రేషన్ షాపునకు బియ్యం పంపిణీ చేయలేదు. పైలట్ ప్రాజెక్టులో భూ భారతి చట్టం, రైతు సదస్సు అని రోజూ కలెక్టర్, ఆర్డీవో మండలంలో తిరుగుతున్నా

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం



ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై నర్సింహులు, సిబ్బంది

చిలిపిచెడ్, మే 8: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నర్సింహులు అన్నారు. గురువారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా చిలిపిచెడ్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు వివిధ రకాల ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే 1930కి కాల్ చేసి తమ వివరాలను తెలిపినట్లయితే నేరస్తుల వివరాలు త్వరగా కనిపెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రాములు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు సీఎంఆర్ఎఫ్ భరోసా



నర్సాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మే 8: నర్సాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి గురువారం అందజేశారు. మున్సిపాలిటీలోని జగన్నాథరావు కాలనీకి చెందిన శాంత సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నది. ఎమ్మెల్యే సహకారంతో రూ.18,500 మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయిూమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, శివకుమార్, రమేశ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## భారత సైనికులకు సంఘీభావం



మెదక్ చౌరస్తా వద్ద జాతీయ జెండాలతో సంఘీభావం

రామాయంపేట, మే 8: ఆపరేషన్ సిందూర్‌తో పాక్ ముష్కరులను చావుదెబ్బ తీస్తున్న భారత సైనికులకు సంఘీభావం తెలుపుతున్నట్లు యువజ్యోతి స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మెదక్ చౌరస్తా వద్ద జాతీయ జెండాలతో సంఘీభావం తెలిపారు. భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలను అభినందించారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి





మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శుభవల్లి

మెదక్ అర్బన్, మే 8: జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కరించేలా కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి శుభవల్లి అన్నారు. గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్ మేనేజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. రాజీమార్గమే రాజమార్గమని, పోలీసులు సమన్వయంతో పనిచేసి ఎక్కువ సంఖ్యలో కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరమేయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. జూన్ 14న నిర్వహించే లోక్ అదాలత్‌ను ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి సిరిసౌజన్య, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు



రామాయంపేట, మే 8: ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు మాజీ కౌన్సిలర్ గజవాడ నాగరాజు తెలిపారు. గురువారం పట్టణంలోని మెదక్ చౌరస్తా వద్ద సొంత ఖర్చులతో చలివేంద్రాన్ని ప్రారంభించారు. సరాఫ్ యాదగిరి, సుప్రభాతరావు, రమేశ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేమె యాదగిరి, సుందర్‌సింగ్, బొర్ర అనిల్ కుమార్, చిలుక గంగాధర్, సరాఫ్ శ్యాంసుందర్, దేవుని రాజు, ఉసికె ప్రకాశ్, బైరం శంకర్ ఉన్నారు.

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



ఉచితంగా మందులు అందిస్తున్న కమిటీ సభ్యులు

రామాయంపేట రూరల్, మే 8: మండలంలోని ఆర్.వెంకటాపూర్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఉచితంగా మందులు అందించినట్లు రెడ్ క్రాస్ మెదక్ శాఖ బృందం తెలిపింది. శిబిరంలో రెడ్ క్రాస్ మెదక్ శాఖ చైర్మన్ డాక్టర్ లయన్ రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి డీజీ శ్రీనివాస శర్మ, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు దేమె యాదగిరి, దామోదర్‌రావు, మద్దెల సత్యనారాయణ, మద్దెల రమేశ్, సతీశ్‌రావు, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు వాలీబాల్ కిట్లు అందజేత



విద్యార్థులకు వాలీబాల్ కిట్లను అందజేస్తున్న పరంజ్యోతి

వెల్దుర్తి, మే 8: వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అయిత పరంజ్యోతి అన్నారు. గురువారం వెల్దుర్తిలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించి విద్యార్థులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 6వ తేదీ వరకు నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రవీందర్‌చారి, మహిపాల్ రెడ్డి, కృష్ణ, మహేందర్‌గౌడ్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

కౌడిపల్లి, మే 8: మండలంలోని దేవుల తండా, తునికి (హరిచంద్‌తండా)లో నూతనంగా నిర్మించిన శ్రీ జగదాంబ దేవి, శ్రీవీరాంజనేయ, శని, రాహు సహిత స్వామి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ నెల 6 నుంచి వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించి గురువారం వేద బ్రాహ్మణులతో ముందుగా విఘ్నేశ్వర పూజ, మంగళ దీపారాధన, మంత్రస్థాపన, గర్త సంస్కారం, స్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు, పలువురు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.